క్లుప్తంగా

ఎంపీ మల్లురవిని సన్మానించిన నాయకులు



నవాబుపేట: నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలుపొందిన మల్లురవిని బుధవారం మండల నాయకులు హైదరాబాద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. గజమాల, బొకేలతో సత్కరించారు. రాజేష్, మల్లేష్ యాదవ్, కొల్లూర్ ఖాజా, నిల్యానాయక్, శివరాములు, శ్రీనివాస్, తిరుపతయ్య, మణికంఠ, శ్రీహరి ఉన్నారు.

కరపత్రాల విడుదల



భూత్పూర్: ఉపాధి హామీ రాష్ట్ర సదస్సును ఈ నెల 10న నిర్వహించనున్నారని.. విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. ఏపీవో విమల, శేఖర్, తిరుపతయ్య, చెన్నయ్య, బాల మాసయ్య పాల్గొన్నారు.

కారు–బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మిడ్జిల్: మండల పరిధిలోని రాణిపేట్ స్టేజీ దగ్గర బుధవారం ఉదయం కారు–బైక్ ఢీకొన్న ఘటనలో మున్ననూర్‌కి చెందిన కావలి జంగయ్యకు తీవ్ర గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. జడ్చర్ల నుంచి మున్ననూర్‌కు బైక్‌పై వస్తున్న జంగయ్యను, కల్వకుర్తి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న కారు వచ్చి ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు.

దివ్యాంగ విద్యార్థి అదృశ్యం

మహమ్మదాబాద్: దివ్యాంగుడైన ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జూలపల్లికి చెందిన గొల్ల సాయన్న మనవడు నందిపేట సాయికుమార్ (16) హైదరాబాద్‌లోని అంధుల స్కూల్‌లో చదువుతున్నాడు. వేసవి నేపథ్యంలో పాఠశాలకు సెలవులు ఉన్నందున జూలపల్లికి వచ్చాడు. ఎప్పటి మాదిరిగా ఈ నెల 3న ఆడుకోవడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో అతడి తాత సాయన్న పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో పర్యావరణ దినోత్సవం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ) పవన్‌కుమార్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో విరివిగా మొక్కలు నాటారు. అలాగే ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించి 'సేవ్ ల్యాండ్', 'సేవ్ ఫ్యూచర్' పేరిట ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో చెట్లను నరికివేయడంతో పర్యావరణంపై ప్రభావం పడుతోందన్నారు. కొందరి తప్పిదాలతో కాలుష్యం ఏర్పడుతోందన్నారు. భూ కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ముఖ్యంగా నీటిని వృథా చేయొద్దన్నారు. కాగా, తక్కువ నీటి వినియోగంతో చేతులను శుభ్రపరచుకునే పరికరాలను రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి, టీఎంసీ కరుణాకర్‌గౌడ్, సీఓలు ఆంజనేయులు, వరలక్ష్మి, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సుమీత్‌రాజ్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రాఘవేంద్రరెడ్డి, టీకేహెచ్‌హెచ్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్, ఎన్‌సీసీ కమాండర్లు, క్యాడెట్లు, మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జడ్చర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జీ లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అదేవిధంగా మొరంబాయితండాలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య మొక్కలు నాటారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలోని బొటానికల్ గార్డెన్‌లో సమన్వయకర్త సదాశివయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో న్యాయవాదులు జంగయ్య, తిరుపతయ్య, మాలిక్, తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రాయపల్లి పంచాయతీ కార్యదర్శి రవి ప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం రాజాపూర్ మండలంలోని రాయపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ శివారులోని పెద్దకుంట కట్టపై ఈత మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరం పాటుపడదామని, భూతాపాన్ని తగ్గించి జీవకోటి మనుగడ కొనసాగించడానికి ప్రతిఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి ఆకుపచ్చ ప్రపంచాన్ని భావితరాలకు బహుమతిగా ఇద్దామని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ మేట్ నర్సిములు, బీజేవైఎం నాయకులు సూరిబాబుగౌడ్, వడ్లప్రశాంత్ నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎంవీఎస్ ఆవరణలో చెత్తను సేకరణ


మొక్కలు నాటుతున్న జడ్జి లక్ష్మి


రాయపల్లిలో ఈతమొక్కలు నాటుతున్న నాయకులు తదితరులు

పచ్చిరొట్టతో భూసారం మెరుగు

రాజాపూర్: రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి పచ్చిరొట్ట ఎరువులను వాడితే భూసారం పెరగడంతోపాటు అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. బుధవారం ఈద్గాన్‌పల్లి, మల్లేపల్లి, కల్లేపల్లి గ్రామాల్లో పచ్చిరొట్ట ఎరువులతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని రైతు ఆగ్రోకేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వినియోగించుకోవాలన్నారు. వెంకట్‌రాజు, సేవకుల సత్యయ్య, నామ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న నాయకులు



దేవరకద్ర: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలవడంతో బుధవారం నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గోప్లాపూర్‌లో ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 101 కొబ్బరికాయలు కొట్టారు. మహేశ్ కుమార్, రాజు, మాధవులు, రజినీకాంత్, దిలీప్, రాఘవేందర్‌గౌడ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో అరుదైన సర్జరీ


మాట్లాడుతున్న డాక్టర్ జీవన్

పాలమూరు: ఒక యువతికి జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సూపరింటెండెంట్ జీవన్, గైనిక్ ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ లక్ష్మీపద్మప్రియ వివరాలు వెల్లడించారు. ఈ మేరకు వివరాలు ఇలా.. మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ అవివాహిత మే 14న కడుపునొప్పితో జనరల్ ఆస్పత్రికి వచ్చింది. కాగా ఆమె పొట్ట భాగం పూర్తిగా ఉబ్బిపోయి ఉన్న విషయాన్ని గైనిక్ వైద్యులు గుర్తించి గడ్డలు ఉన్నాయి అనే అనుమానంతో పరీక్షలు, స్కానింగ్ చేయించారు. ఈ క్రమంలో అండంలో గడ్డ మాదిరిగా ఉండే తిత్తి ఉన్నట్లు గుర్తించారు. యువతికి పెళ్లి కాకపోవడం వల్ల భవిష్యత్‌లో.. పెళ్లి అయిన తర్వాత సంతాన సమస్య రాకుండా శస్త్ర చికిత్స చేయాలని డాక్టర్లు నిర్ణయించారు. దీనికి కోసం అన్ని విభాగాల వైద్య బృందంతో చర్చించి మే 23న సర్జరీ పూర్తి చేశామన్నారు. దాదాపు ఐదు కేజీల గడ్డ వెలికి తీశామని, శాంపిల్స్ సేకరించి బయాప్సీకి పంపించి క్యాన్సర్ కాదని నిర్ధారించినట్లు తెలిపారు. అన్ని విభాగాల సాయంతో ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద ఈ సర్జరీ చేశామన్నారు. ఇదే సర్జరీ బయట అయితే దాదాపు రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిగా 2016లో ఏర్పడిన తర్వాత గత 8 ఏళ్ల కాలంలో ఆస్పత్రిలో ఓపీ 300 నుంచి 2వేల వరకు పెరిగిందని, ఐపీ 600లకు పెరిగిందన్నారు. డెలివరీలు నెలకు 900 వరకు అవుతున్నాయని, ఆర్థో సర్జరీలు మేజర్ 100వరకు, మైనర్ అధికంగా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు, సర్జరీలు చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డాక్టర్ నవల్‌కిషోర్, డాక్టర్ హన్మంతు ప్రసాద్, డాక్టర్ సరిత, డాక్టర్ తేజస్విని, జ్యోతి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని లారీబోల్తా

పగిలిన వరిబస్తాలు



భూత్పూర్: మండలంలోని శేరిపల్లి(బి) వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం వరి బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శేరిపల్లి (బి) గ్రామస్తుల కథనం ప్రకారం మెదక్ జిల్లా రంగాపురం నుంచి సదరు లారీ జోగులాంబ గద్వాల జిల్లాకు 790 వరి బస్తాల లోడ్‌తో వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఘటనలో వరి బస్తాలు పగలడంతో పాటు 10 బస్తాల ధాన్యం రహదారిపై పడిపోయింది. సమాచారం తెలుసుకున్న ఎల్‌అండ్‌టీ సిబ్బంది ఘటన స్థలం వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మరో లారీ తెప్పించి వరి ధాన్యాన్ని జోగులాంబ గద్వాల జిల్లాకు తరలించారు.

235 జతల యూనిఫామ్స్ అందజేత



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కుట్టిన 235 జతల కొత్త యూనిఫామ్స్‌ను ఎంఈఓ కార్యాలయంలో మెప్మా సిబ్బంది అందజేశారు. కాగా ఈనెల 1 నుంచి ఇప్పటి వరకు 1,268 జతల యూనిఫామ్స్ అప్పగించారు.

సమన్వయంతో పనిచేయాలి


భూత్పూర్‌లో మండలసభలో మాట్లాడుతున్న ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి

భూత్పూర్: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక గ్రామ ప్రజాప్రతినిధుల సమన్వయంతో అధికారులు పనిచేయాలని ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాలల్లో మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఇళ్లు, రహదారుల పక్కన నీళ్లు నిల్వకుండా చూడాలని, మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేసే నీటి పైపులు లీకవుతే వెంటనే మరమ్మత్తు చేపట్టాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ప్రజాఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పరంగా చేపడుతున్న పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, ఎంపీడీవో ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్ గీత, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, ఎంపీఓ శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు రజిత, నిర్మల, రమణి, వెంకటేశ్వరి, ఊషయ్య, పుల్లయ్య, సాయిలు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు ప్రశంసాపత్రాలు



జడ్చర్ల: రక్తదానం అన్ని దానాల్లోకెల్లా గొప్పదని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ తెలిపారు. బుధవారం మండలపరిధిలోని పోలేపల్లి సెజ్‌లోని ఎల్ అండ్ టీ నిర్మాణ నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు రక్తదానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎల్‌అండ్ టీ ప్రిన్స్‌పాల్ దీపక్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



బాలానగర్: మండల పరిధిలోని ఉడిత్యాల, పంచాంగులగడ్డ తండాలలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులను జెడ్పీ సీఈఓ రాఘవేందర్ రావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఉడిత్యాలలో ఏకరూప దుస్తుల కుట్టుపై ఆరా తీశారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మండలప్రత్యేక అధికారి బాబురావ్, ఎంపీడీఓ శతర్ చంద్ర బాబులతోపాటు ఇతర అధికారులు ఉన్నారు.

పాలమూరులో బీఆర్‌ఎస్‌కు భారీగా నష్టం

- అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే బీజేపీకి 61,498 ఓట్లు అధికం
- కాంగ్రెస్‌కు 11,455ఓట్లు తగ్గిన వైనం



పాలమూరు: మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌కు 45,447 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి 42,308 ఓట్లు రాగా, స్వతంత్ర అభ్యర్థి సయ్యద్ ఇబ్రహీంకు 27395 ఓట్లు పడ్డాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 1,57,164 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. కాగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో 1,40,543 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంట్లో అసెంబ్లీతో పోల్చితే ఎంపీ ఎన్నికల్లో 16,621 ఓట్లు తగ్గాయి. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌కు 86,474 ఓట్లు రాగా, మహాకూటమి అభ్యర్థి ఎర్ర శేఖర్‌కు 28, 699ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థికి మెజార్టీ 57, 775 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి పద్మజారెడ్డికి 5వేల ఓట్లు వచ్చాయి. తాజాగా 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 20 రౌండ్‌లలో కలిపి కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి 87,227ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి వి.శ్రీనివాస్‌గౌడ్‌కు 68,489 ఓట్లు వచ్చాయి. దీంతో వి. శ్రీనివాస్‌గౌడ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి18,738ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పటి బీజేపీ అభ్యర్థి అయిన ఏపీ మిథున్‌రెడ్డికి 19,376 ఓట్లు వచ్చాయి.

- 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి 54,566ఓట్లు అధికంగా వచ్చాయి. ప్రస్తుతం జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 80, 874 ఓట్లు సాధించింది. ఈ ప్రకారం చూస్తే ఐదేళ్ల సమయంలో మహబూబ్‌నగర్‌లో బీజేపీ పార్టీ చాలా వరకు బలపడింది. ప్రధానంగా పట్టణంలో ఉన్న ఓటర్లు బీజేపీపై చాలా వరకు ఆసక్తి చూపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాడర్ బలంగా లేకపోవడం వల్ల కొంత వరకు వెనుకబడింది.
- మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,81,635 ఓట్లు పోల్ కాగా ప్రస్తుత సభ లోక్ సభ ఎన్నికల్లో 1,71, 822ఓట్లు పోల్ అయ్యాయి. అసెంబ్లీతో పోల్చితే 9,813ఓట్లు తగ్గాయి. ఈ ఎన్నికల్లో తగ్గిన ఓట్లు అధికార పార్టీకి బాగా నష్టం చేశాయి. పోలింగ్ సరళి పెరిగి ఉంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు పెరిగే అవకాశం ఉండేది.

2024లోక్ సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో రౌండ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

రౌండ్	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
1	3106	1090	4094
2	3314	1513	4828
3	3084	1127	5063
4	3211	957	5021
5	3617	1680	4882
6	2291	779	3924
7	1993	510	4156
8	2987	594	5241
9	4625	209	1841
10	4378	348	3262
11	4007	381	3367
12	8257	335	2175
13	3061	381	5489
14	1697	296	5283
15	4093	233	3001
16	5732	296	2995
17	3257	368	5197
18	4250	541	3794
19	3533	317	2754
20	2157	553	3434
	73273	13087	80,874

2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

రౌండ్	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
1	4143	4526	701
2	4454	4507	1171
3	4169	4639	979
4	4755	4011	1072
5	4969	4872	932
6	4395	4124	1161
7	4355	3351	944
8	4379	3288	1137
9	4302	2036	547
10	4463	2613	757
11	4441	2629	718
12	5935	3874	530
13	3924	3346	1338
14	2979	2780	1864
15	3625	2736	1080
16	4797	2776	1200
17	3825	3416	1432
18	4228	3534	767
19	3801	2534	667
20	2789	2144	379
	84728	67736	19376

2023 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో వచ్చిన ఓట్లు

ఈవీఎంలలో పోలైన ఓట్లు
1,77,704

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు
3,931

మొత్తం ఓట్లు
1,81,635

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయసమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (1998–99 బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో బుధవారం స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధనలు చేసిన నాటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. నాటి రోజులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు విద్యాసాగర్, సత్యనారాయణ, యాదయ్య సుజాత, పూర్వ విద్యార్థులు మోటెసత్యం, ముస్తఫా, మహేష్, మహిపాల్‌రెడ్డి, అబ్దుల్‌సమీ, వినోద్‌కుమార్, పుష్పలత, ప్రనిత, మమత తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టపై కంప చెట్ల తొలగింపు

అడ్డాకుల: మండలంలోని గుడిబండ చెరువు కట్టపై కంప చెట్లను తొలగిస్తున్నారు. స్థానిక చెరువులో ఉపాధి కూలీలు ఒండ్రుమట్టిని తీసి మరోచోట వేసే పనులు చేస్తున్నారు. అయితే చెరువు కట్టపై పెద్ద ఎత్తున కంపచెట్లు ఉండటంతో వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తుతాయన్న కారణంతో వాటిని తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. దీంతో ఉపాధి కూలీలు చెరువు కట్టపై కంపచెట్లు తొలగించే పనులు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇతర గ్రామాల్లోని చాలా చోట్ల చెరువు కట్టలపై కంప చెట్లు పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో పాటు చెరువు కట్టలు కూడా పాడవుతున్నాయి. ఉపాధిహామీలో చెరువు కట్టల అభివృద్ధికి సంబంధించిన పనులు చేయిస్తే తమకు మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కాగా చెరువు కట్టలపై కంపచెట్లు తొలగిస్తే మళ్లీ వస్తుండటంతో అధికారులు వాటిపై దృష్టి సారించడం లేదని తెలుస్తోంది.